



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :15 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :15 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 20 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## వైఎస్ కుటుంబం కదా అని ఇన్ని రోజులు భరించాను





### వైసీపీకి వరుస దెబ్బలు
### ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న సీనియర్ నేతలు
### జనసేనలో బాలినేని చేరికకు రంగం సిద్ధం

పెన్ పవర్ డెస్క్:జగన్ నాయకత్వంలోని వైసీపీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు ఎదుర్కొన్న వైసీపీ... ఇప్పుడు కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో మరింత డీలాపడే పరిస్థితి ముంగిట నిలిచింది. తాజాగా, బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. ఆయన జనసేన పార్టీలో చేరుతున్నారు. ఈ సాయంత్రం ఆయన జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో భేటీ అయ్యారు. పార్టీలో చేరికపై చర్చించారు. పవన్ ఆయనకు మనస్ఫూర్తిగా స్వాగతం పలికినట్టు తెలుస్తోంది. పవన్ తో భేటీకి ముందు బాలినేని మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైఎస్ కుటుంబం కదా అని ఇన్ని రోజులు భరించానని వెల్లడించారు. పార్టీ కోసం ఎన్ని త్యాగాలు చేసినా జగన్ గుర్తించలేదని, కనీసం తన గురించి జగన్ ఒక్క సభలో కూడా మాట్లాడలేదని ఆరోపించారు. కానీ పరిచయం లేకపోయినప్పటికీ పవన్ కల్యాణ్ తన గురించి రెండు, మూడు సార్లు మంచిగా మాట్లాడారని బాలినేని వివరించారు. పార్టీలో తాను ఎదుర్కొన్న పరిస్థితుల పట్ల ఏడ్చిన రోజులు ఉన్నాయని, ఇప్పుడు కన్నీళ్లు కూడా ఇంకిపోయాయని తీవ్ర భావోద్వేగంతో చెప్పారు. తానెప్పుడూ ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడేవాడ్నని, అదే తనకు ప్రతికూలంగా మారిందని అన్నారు. ప్రజల సమస్యల గురించి చెబితే జగన్ కు నచ్చేది కాదని, ఓడినా కానీ జగన్ లో మార్పులేదని విమర్శించారు. ఇక, తాను జగన్ ను బ్లాక్ మెయిల్ చేసినట్టు కొన్ని యూట్యూబ్ చానళ్లు రాశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ను నమ్మి తాను ఆస్తులు పోగొట్టుకున్నానని బాలినేని వెల్లడించారు. గతంలో తనను ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వైసీపీని వీడలేదని తెలిపారు. ఇప్పుడు జనసేన పార్టీలోకి వెళుతోంది అధికారం కోసం కాదని స్పష్టం చేశారు.

తనకు పదవులు ముఖ్యం కాదని, ఆత్మాభిమానం ముఖ్యమని బాలినేని ఉద్ఘాటించారు. గతంలో మంత్రి పదవినే వదులుకున్నానని వెల్లడించారు. తాను ఎలాంటి షరతులు విధించకుండా జనసేన పార్టీలో చేరుతున్నానని, పవన్ ఏం చెబితే అది చేస్తానని చెప్పుకొచ్చారు. ఒంగోలులో భారీ సభ ఏర్పాటు చేసి, జనసేన కండువా కప్పుకుంటానని వెల్లడించారు.

ఇక, పవన్ తో భేటీ అనంతరం బాలినేని సోషల్ మీడియాలో తన ప్రొఫైల్ పిక్ కూడా మార్చేశారు. పవన్ కు తాను శాలువా కప్పిన ఫోటోను ప్రొఫైల్ పిక్ గా పెట్టుకున్నారు.

## ఏపీలో వరద బాధితులకు రూ.25 కోట్ల భారీ విరాళం అందించిన అదానీ గ్రూప్



- ఏపీలో ఇటీవల వరద బీభత్సం
- సీఎం రిలీఫ్ ఫండ్ కు భారీగా విరాళాలు
- రూ.25 కోట్ల విరాళంతో ముందుకొచ్చిన అదానీ గ్రూప్

పెన్ పవర్ డెస్క్:సెప్టెంబరు మొదటి వారంలో సంభవించిన వరదలు ఏపీలోని పలు ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. 40 మందికి పైగా మృత్యువాతపడ్డారు. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. తీవ్రస్థాయిలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు భారీగా

వివరాలు 2లో..

## తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు



- తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం
- లడ్డూ తయారీకి జంతువుల నూనెలు వాడారన్న సీఎం చంద్రబాబు
- చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- సీఎం వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయన్న షర్మిల
- తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్

వివరాలు 2లో..



## జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేశాం
### వెల్లడించిన పోలీసులు

- జానీ మాస్టర్‌ను గోవా కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడి
- పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించినట్లు వెల్లడి
- ఫోక్సోకేసుతో పాటు రేప్ కేసు నమోదు చేశామన్న పోలీసులు

వివరాలు 2లో..

## భగవంతుడి సన్నిధిలో ప్రమాణం చేయడానికి మేం సిద్ధం.. చంద్రబాబు సిద్ధమా?

### 'తిరుమల లడ్డు' వ్యాఖ్యలపై వైవీ సుబ్బారెడ్డి

- తిరుమల లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారన్న చంద్రబాబు
- తిరుమలను వైసీపీ అపవిత్రం చేసిందన్న సీఎం
- రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారుతారన్న సుబ్బారెడ్డి
- జులైలో నాసిరకం నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై టీటీడీ వేటు



వివరాలు 2లో..

## సంతోషించాల్సిన సమయంలో జగన్ బాధపడుతున్నాడు

- చంద్రబాబు పాలనలో పెట్టుబడులు భారీగా వస్తున్నాయని వెల్లడి
- జగన్ ఓర్వలేకపోతున్నాడని ఆగ్రహం
- జగన్ పాలనలో పెట్టుబడులే రాలేదన్న టీడీపీ సీనియర్ నేత



పెన్ పవర్ డెస్క్: చంద్రబాబుపాలనలో ఏపీ రాజధాని అమరావతికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, దీన్ని చూసి జగన్మోహన్ రెడ్డికి కడుపు మంట మొదలైందని టీడీపీ సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. జగన్ పాలనలో ఏపీకి ఒక్క పెట్టుబడి కూడా రాలేదని అన్నారు. ఇప్పుడు ఏపీకి పెట్టుబడులు వస్తుంటే సంతోషించాల్సిన సమయంలో, జగన్ బాధపడుతున్నాడని మండిపడ్డారు. "చంద్రబాబు విజనరీ పాలనను

వివరాలు 2లో..

### ఈ నెల 22న జనసేనలో
## చేరుతున్నా



- వైసీపీకి గుడ్ బై చెప్పిన సామినేని ఉదయభాను
- జనసేన కార్యాలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే
- వైసీపీలో తనకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని వెల్లడి

వివరాలు 2లో..

## నందిగం సురేశ్ కు మరో 14 రోజుల రిమాండ్ పొడిగింపు



- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం అరెస్ట్
- ఇటీవల రెండ్రోజుల కస్టడీకి అప్పగించిన కోర్టు
- కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- అక్టోబరు 3 వరకు రిమాండ్ విధించిన న్యాయస్థానం

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన సంగతి తెలిసిందే. ఇటీవలే నందిగం సురేశ్ ను న్యాయస్థానం రెండ్రోజుల పోలీస్ కస్టడీకి అప్పగించింది. కస్టడీ ముగియడంతో అతడిని పోలీసులు తాజాగా కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నందిగం సురేశ్ కు మరో 14 రోజుల రిమాండ్ విధించింది. అక్టోబరు 3 వరకు

## రాహుల్ గాంధీపై ఢిల్లీలోని మూడు పోలీస్ స్టేషన్లలో బీజేపీ ఫిర్యాదు

- రిజర్వేషన్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న బీజేపీ
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను రెచ్చగొట్టేలా మాట్లాడారని ఫిర్యాదు
- ఇటీవల అమెరికా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలపై మండిపడుతున్న బీజేపీ

వివరాలు 2లో..



## కశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను అమలు కానివ్వబోం

- వారసత్వ రాజకీయాలకు ముగింపు పలికేందుకు బీజేపీకి ఓటు వేయాలని పిలుపు
- జమ్ము కశ్మీర్ భవిష్యత్తు కోసం ఎన్నికలు జరుగుతున్నాయన్న ప్రధాని
- వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్న ప్రధాని

పెన్ పవర్ డెస్క్:కశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను ఎట్టి పరిస్థితుల్లో అమలు కానివ్వబోమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. జమ్ము కశ్మీర్ రెండో విడత ఎన్నికల ప్రచారం నేపథ్యంలో కాట్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీల మేనిఫెస్టో చూసి పాకిస్థాన్ సంబరాలు చేసుకుంటోందన్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ పార్టీల వారసత్వ రాజకీయాలకు ముగింపు పలికేందుకు బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# జమిలీ ఎన్నికలకు మరో రెండు అడుగులు

జమలి ఎన్నికల దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. జమిలీ ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణలు తప్పనిసరి అయిన దశలో.. పార్లమెంటు ఉభయసభలతో పాటు రాష్ట్ర అసెంబ్లీలు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో మూడించ రెండు వంతుల ఎంపీల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో భాజపా బలం చూస్తే.. ఎన్డీయే పక్షాలతో పాటు ఇతర పక్షాల ఎంపీలు కూడా కొందరు సహకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్‌డీఏ బలం 293 కాగా.. రాజ్యాంగ సవరణ కోసం 362 మంది ఎంపీల మద్దతు అవసరం. ఇదే విధంగా రాజ్యసభలో ఎన్‌డీఏ బలం 121 కాగా.. రాజ్యాంగ సవరణలు చేపట్టాలంటే 164 మంది సభ్యుల మద్దతు ఉండాలి. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల మాటలకూ గౌరవం ఉంటుంది కాబట్టి.. రాజ్యాంగ సవరణకు సగం రాష్ట్రాల అసెంబ్లీలు అనుమతించాలి. అంటే దాదాపు 14కి పైగా రాష్ట్రాలు ఆమోదం తెలపాలి. ప్రస్తుతం దేశంలో భాజపా సొంతంగా 13 రాష్ట్రాల్లో.. కూటమిగా 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉండడం కలిసి వచ్చే అంశం. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను చట్ట సభలు అంటాం. పార్లమెంటులో దేశానికి సంబంధించిన చట్టాలు చేస్తే.. అసెంబ్లీల్లో ఆయా రాష్ట్ర ప్రజల కోసం చట్టాలు చేస్తాయి. చట్ట సభల్లో చట్టాలు చేసే అధికారం అధికార పార్టీకి ఉంటుంది. అంటే ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ అన్నమాట. ప్రస్తుతం మన దేశంలో పది వరకు జాతీయ పార్టీలు.. వందకుపైగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. జాతీయ పార్టీలు ఇటు పార్లమెంటు, అటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు మాత్రం రాష్ట్రాలకే పరిమితం. స్థానిక సమస్యలు, ప్రజల ఆకాంక్ష మేరకు ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారం చేపట్టాయి. అయితే.. తాజాగా కేంద్రం త్వరలో అమలు చేయబోతున్న జమిలి ఎన్నికలు ప్రాంతీయ పార్టీలకు పెను ముప్పుగా మారబోతున్నాయా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు.నేషన్.. వన్ ఎలక్షన్ నినాదాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చాలాకాలంగా ప్రజల్లో చర్చ జరిగేలా చేసింది. తర్వాత దీనిని ఆచరణలో పెట్టేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటి దాదాపు ఏడాదిపాటు దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించింది. జమిలి ఎన్నికలపై అన్ని పార్టీల అభిప్రాయం తీసుకుంది. ఇక జమిలి ఎన్నికలతో కలిగే ప్రయోజనాలు, నష్టాలను కూడా పరిశీలించింది. ఎన్నికలతో నష్టం కన్నా లాభమే ఎక్కువగా ఉండడంతో ఈమేరకు నివేదిక తయారు చేసి కేంద్రానికి నివేదించింది.రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికకు కేంద్ర కేబినెట్‌ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే శీతాకాల సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లేదు. సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుకు ఆమోదం లభిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు అయిన టీడీపీ, జేడీఎస్ కీలకంగా ఉన్నాయి. వీటితోపాటు జేడీయూ, అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందాలంటే 270 ఎంపీల మద్దతు అవసరం బీజేపీకి ప్రస్తుతం 235 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. ఇక రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి. ఎన్డీ పక్షాలు మద్దతు తెలిపితే బిల్లు ఆమోదం పెద్ద కష్టం కాదు.పార్లమెంటులో వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొంది రాజ్యాంగ సవరణ ప్రక్రియ పూర్తయితే 2029లోనే జమిలి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా నష్టపోతాయి. కేబినెట్ ఆమోదించిన రామ్‌నాథ్ కోవింద్ నివేదిక మేరకు వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు కేంద్రం బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అంతకన్నా ముందు ఈ నివేదికను న్యాయ మంత్రిత్వ శాఖ ముందు 110 రోజులు ఉంచాలని కేంద్రం నిర్ణయించింది. దేశ వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా వనరులను, సంపదను ఆదా చేయడంతోపాటు అభివృద్ధి, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని కేంద్రం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ నివేదికలో పేర్కొంది. ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడానికి జమిలి ఎన్నికలు దోహదపడతాయని తెలిపింది.ఇదిలా ఉంటే.. కేంద్ర కేబినెట్ ఆమోదించిన రామ్‌నాథ్ కోవింద్ నివేదికలో ఏముంది అన్న చర్చ ఇప్పుడు జరుగుతోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ.. తన నివేదికలో జమిలి ఎన్నికలకు సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందించింది. మొదటి విడతగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని సిఫారసు చేసింది. ఇందుకు రాజ్యాంగంలోని ఆర్టిక్ 18ని సవరించాలని సూచించింది. దీంతో రాష్ట్రాల అసెబ్లీల ఆమోదం అవసరం లేకుండానే ఎన్నికలు నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపింది. ఈమేరకు రాజ్యాంగ సవరణలను పార్లమెంటులో ఆమోదం పొందాల్సి ఉంటుందని పేర్కొంది.రాష్ట్రాల ఎన్నికల అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం సంప్రదింపులు జరిపి కామన్ ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డులను రూపొందించాలి.ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యత వహిస్తుంది. మున్సిపాలిటీ, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతలను రాష్ట్రాల ఎన్నికల కమిషన్‌లు చూసుకుంటున్నాయి. జమిలి ఎన్నికల్లోనూ ఇదే విధానం కొనసాగించాలి.జాతీయ పార్టీల ప్రభావమే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం వలన ప్రాంతీయ పార్టీలకన్నా.. జాతీయ పార్టీలవైపే ప్రజలు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీంతో క్రమంగా చట్ట సభల్లో ప్రాంతీయ పార్టీల ప్రభావం తగ్గుతుంది. అయితే సార్వత్రిక ఎన్నికల తర్వాత నిర్వహించే మున్సిపల్, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం ప్రాంతీయ పార్టీలే ప్రభావం చూపుతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే చట్టాల రూపకల్పనలో మాత్రం ప్రాంతీయ పార్టీల భాగస్వామ్యం తగ్గుతుంది.

# ఏపీలో వరద బాధితులకు రూ.25 కోట్ల భారీ విరాళం అందించిన అదానీ గ్రూప్

- మొదటి పేజీ తరువాయి

విరాళాలు అందుతున్నాయి. తాజాగా అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. వరద బాధితుల సహాయార్థం రూ. 25 కోట్లు అందిస్తున్నట్టు అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ప్రీతి అదానీ ప్రకటించారు. ఈ క్రమంలో నేడు ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ రూ. 25 కోట్ల విరాళం తాలూకు పత్రాలు అందించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్ ప్రీతి అదానీకి, అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీకి కృతజ్ఞతలు తెలియజేశారు. వరద బీభత్సంతో కుదేలైన రాష్ట్ర ప్రజల జీవితాలను మళ్లీ నిలబెట్టడంలో మీ విరాళం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది అంటూ అదానీ గ్రూప్ ను ఉద్దేశించి చంద్రబాబు ట్వీట్ చేశారు.

# తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం నడుస్తోంది. ఈ పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి జంతువుల నూనెలు వాడారని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పవిత్రమైన తిరుమల ఆలయంపై అలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. కాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఖండించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని ఆమె హితవు పలికారు. ఈ మేరకు తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. సీఎం హోదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు చేసిన ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే... భావోద్వేగం మీద రాజకీయం చేసే ఉద్దేశమే లేకుంటే.. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే... తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేయాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. మహా పాపానికి.. ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చండని ఆమె సవాల్ విసిరారు. చంద్రబాబు తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని, నిజాలు నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

# భగవంతుడి సన్నిధిలో ప్రమాణం చేయడానికి మేం సిద్ధం.. చంద్రబాబు సిద్ధమా?

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవేంకటేశ్వరసామి లడ్డూ ప్రసాదంలో గత ప్రభుత్వం జంతువుల కొవ్వు కలిపేదన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. రాజకీయంగానూ చంద్రబాబు వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌హాల్‌లో నిన్న ఎన్డీయే ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ పవిత్ర తిరుమల ఆలయాన్ని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందని పేర్కొన్నారు. ప్రసాదంలో నాణ్యతలేని పదార్థాలను ఉపయోగించిందని ఆరోపించారు. చంద్రబాబు వ్యాఖ్యలు శ్రీవారి భక్తులనే కాదు.. అందరినీ షాక్‌కు గురిచేశాయి. "వైసీపీ హయాంలో నాణ్యత లేని పదార్థాలను వాడడమే కాదు.. లడ్డు ప్రసాదంలో నాణ్యమైన నెయ్యికి బదులు జంతువుల కొవ్వు కలిపారు. ఇది తిరుమలను అపవిత్రం చేసింది" అని చంద్రబాబు పేర్కొన్నారు.చంద్రబాబు వ్యాఖ్యలను వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తోసిపుచ్చారు. తిరుమల పవిత్రతను, కోట్లాదిమంది హిందువుల విశ్వాసాలను చంద్రబాబు తీవ్రంగా దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పెద్ద పాపమని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని అన్నారు. ఈ ప్రపంచంలో పుట్టిన వారెవరూ ఇలాంటి మాటలు మాట్లాడరని, ఇలాంటి ఆరోపణలు చేయరని, రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు ఎంతవరకైనా దిగజారుతారని మరోమారు రుజువైందని మండిపడ్డారు. ఈ విషయంలో తాను తన కుటుంబంతో కలిసి భగవంతుడి సన్నిధిలో ప్రమాణం చేయడానికి సిద్ధమని, చంద్రబాబు కూడా అలా చేయడానికి సిద్ధమా? అని సవాలు విసిరారు.

కాగా, ఈ ఏడాది జులైలో నాసిరకం నెయ్యిని సరఫరా చేసినందుకు ఓ కాంట్రాక్టర్‌ను టీటీడీ బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. ఆ తర్వాత బెంగళూరులోని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) లిమిటెడ్ హై-గ్రేడ్ నెయ్యిని ప్రవేశపెట్టింది. కాంట్రాక్టర్ కల్తీనెయ్యిని సరఫరా చేసినట్టు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) నిర్ధారించింది.

# నందిగం సురేశ్ కు మరో 14 రోజుల రిమాండ్ పొడిగింపు

- మొదటి పేజీ తరువాయి

నందిగం రిమాండ్ కొనసాగనుంది. ప్రస్తుతం ఆయన గుంటూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

**మహిళ మృతి కేసు నిందితుల జాబితాలో నందిగం పేరు!**

కాగా, 2021లో తుళ్లూరు మండలం వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ మృతి చెందగా, ఈ కేసులోని నిందితుల జాబితాలో పోలీసులు నందిగం సురేశ్ పేరును కూడా చేర్చారు.

ఈ కేసులో నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ

పోలీసులు మంగళగిరి కోర్టులో పీటీ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన న్యాయస్థానం... ముందు ఈ కేసులో నందిగం సురేశ్ పాత్ర ఏమిటో స్పష్టం చేయాలని పోలీసులను ఆదేశించింది.

# ఈ నెల 22న జనసేనలో చేరుతున్నా

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీకి గుడ్ బై చెబుతున్న కీలక నేతల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. మొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, తాజాగా సామినేని ఉదయభాను... వైసీపీని వీడారు. తాను ఈ నెల 22న (ఆదివారం) జనసేన పార్టీలో చేరుతున్నట్టు సామినేని ఉదయభాను ప్రకటించారు. తనతో పాటు వచ్చే కార్యకర్తలను కూడా జనసేన పార్టీలోకి తీసుకెళతానని పేర్కొన్నారు. సామినేని ఉదయభాను నేడు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వైసీపీలో తనకు ప్రాధాన్యత తగ్గిందని సామినేని అన్నారు. పార్టీ అధినాయకత్వం

తీరు నచ్చకే రాజీనామా చేస్తున్నానని స్పష్టం చేశారు. కాగా, బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా ఆదివారం నాడే జనసేనలో చేరనున్నట్టు తెలుస్తోంది. వీరిద్దరూ జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు.

# 20 నుంచి పైడితల్లి ఉత్సవాలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయనగరం, సెప్టెంబర్ 19:**




ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 30న ఉదయం 8 గంటల నుంచి దీక్షల విరమణ ఉంటుంది. దేవస్థానం ఛైర్మన్, ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు, భక్తుల సలహాలు, సూచనలతో ఉత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్ర పండగగా ప్రకటించినందున అమ్మవారికి టీటీడీ, ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పిస్తాయి.సెప్టెంబర్ 20న ఉదయం 8 గంటలకు చదురుగుడి వద్ద పందిరి రాట, మండల దీక్షతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఉదయం 11 గంటలకు వనం గుడి వద్ద ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. అక్టోబర్ 10న అర్ధమండల దీక్షలు ప్రారంభం అవుతాయి. అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, అక్టోబర్ 15న సిరిమానోత్సవం, అక్టోబర్ 22న తెప్పోత్సవం, అక్టోబర్ 27న కలశజ్యోతుల ఊరేగింపు, అక్టోబర్ 29న ఉయ్యాల కంబాల ఉత్సవం, అక్టోబర్ 30న వనంగుడిలో చండీహోం, పూర్ణాహుతి, దీక్ష విరణమతో ఉత్సవం ముగియనుంది. ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం అక్టోబర్ 22న సాయంత్రం విజయనగరం పట్టణంలోని పెద్ద చెరువులో మంగళ వాయిద్యాల నడుమ, సంప్రదాయ బద్ధంగా కన్నుల పండువగా నిర్వహిస్తారు. పైడిమాంబ తాను వెలసిన స్థలంలో పెద్ద చెరువులో హంస వాహనంలో ముమ్మారు విహరిస్తారు. ఈ అపూర్వ దృశ్యాన్ని చూసి భక్తులు పులకిస్తారు. నిర్ణీత ముహూర్తంలో పైడితల్లి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక పల్లికిలో తిరువీధోత్సవం నిర్వహించి, పెద్ద చెరువు పడమటి భాగానికి చేర్చుతారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన హంసవాహన పడవపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు.ఈ ఉత్సవాలకు సుమారు ఆరు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో 11 ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. అలాగే ఈ ఉత్సవాలకు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. సుమారు రెండు కోట్లు ఖర్చు చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.పైడితల్లి (పైడిమాంబ) ఉత్తరాంధ్ర ప్రజల దైవం, పూసపాటి రాజుల ఇలవేల్పు. అమ్మవారి దేవాలయం విజయనగరం పట్టణంలోని మూడు లాంతర్లు కూడలి వద్ద నిర్మించారు. అమ్మవారి ఉత్సవాలు 1758లో ప్రారంభమై 250 ఏళ్లగా నిరాటంకంగా కొనసాగుతున్నాయి. 1757లో విజయదశమి వెళ్లిన మంగళవారం నాడు విజయనగరం పెద్ద చెరువులోంచి అమ్మవారి విగ్రహాన్ని పతివాడ అప్పలస్వామి నాయుడు అనే వ్యక్తి పైకి తీశారు. ఆయనే అమ్మవారికి తొలి పూజారి అయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కుటుంబానికి చెందిన వారే వంశపారంపర్యంగా పూజారులుగా ఉంటున్నారు. ప్రస్తుత పూజారి బంటుపల్లి బైరాగి నాయుడు ఆరో తరం వారు. ఈ పూజారే సిరిమానోత్సవంలో సిరిమాను అధిరోహించి భక్తుల్ని ఆశీర్వదిస్తారు. అందువల్ల పైడితల్లి అమ్మవారి పండగా విజయదశమి (దసరా) అయిన తరువాత వచ్చిన మొదటి మంగళవారం నాడు జరుగుతుంది. సోమ, మంగళ, బుధవారాల్లో ఈ పండగ ఉంటుంది. మంగళవారం సిరిమానోత్సవం ఉంటుంది. సిరిమానుకు ముందు బెస్తవారి వల, పాలధార, తెల్ల ఏనుగు, అంజలి రథం ఉంటాయి. సిరిమాను 33 మూరలు ఉంటుంది.చారిత్రాత్మకంగా పైడితల్లి అమ్మ పెద్ద విజయరామరాజు చెల్లెలు. పసిప్రాయం నుంచి ఆధ్యాత్మిక భావాలతో దేవీ ఉపాసన చేసేది. అన్న పొరుగు రాజ్యమైన బొబ్బిలిపై యుద్ధ సన్నహాలు చేయడం, ఆమెను కలత పెట్టింది. బ్రిటీష్ కుట్రకు లొంగిపోయిన విజయరామరాజు చెల్లెలి యుద్ధ నివారణ ప్రయత్నాల్ని లెక్క చేయలేదు. 1757లో బొబ్బిలిపై యుద్ధం ప్రకటించాడు. వెలమ వీరులు తమ పౌరుష ప్రతాపాల్ని ఫణంగా పెట్టి విజయమో వీర స్వర్గమో అన్నట్లు పోరాడారు. కానీ విజయం విజయరామరాజునే వరించింది. ఆ రోజు రాత్రి దేవి కలలో కనిపించి అన్న ప్రాణాలకు వచ్చే ప్రమాదాన్ని ముందే హెచ్చరించింది. ఉపవాసదీక్షలో ఉన్న ఆమె పతివాడ అప్పలనాయుడు, మరికొందరు అనుచరుల్ని వెంటబెట్టుకుని బొబ్బిలి బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లగానే ఆమె అపస్మారక స్థితిలోకి జారుకుంది. తన ప్రతిమ పెద్ద చెరువు పశ్చిమ భాగంలో లభిస్తుందని, దాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు, ఉత్సవాలు చేయాలని చెప్పి ఆమె దేవిలో ఐక్యం అయిపోయింది.

# సంతోషించాల్సిన సమయంలో జగన్ బాధపడుతున్నాడు

- మొదటి పేజీ తరువాయి

చూసి నేడు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆస్ట్రేలియా, యూఏఈ ఆసక్తి చూపిస్తున్నాయి.. రూ. 250 కోట్లతో ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ సంస్థ ఏర్పాటు కానుంది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయబోతున్నారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు బీసీఐ ( బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ) ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. రూ. 300 కోట్లతో హెచ్ పీసీఎల్, ఎన్టీపీసీ, ఓఎన్జీసీ, ఇండియన్ బ్యాంక్, ఎస్ బీఐ వంటి ప్రఖ్యాత సంస్థలు తమ కార్యకలాపాలను ఇక్కడ నుంచే మొదలుపెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇలాంటి సందర్భంలో తెలుగువాడిగా పుట్టిన ప్రతివాడు ఏపీ ప్రజల భవిష్యత్తు బాగుపడుతుందని సంతోషించాలి. కానీ జగన్ బాధపడుతున్నాడు, రాజధానిపై విషం కక్కుతున్నాడు" అని విమర్శించారు.

# కశ్మీర్‌లో పాకిస్థాన్ అజెండాను అమలు కానివ్వబోం

- మొదటి పేజీ తరువాయి

జమ్ము కశ్మీర్ భవిష్యత్తు కోసమే ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జమ్ము కశ్మీర్‌పై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వివక్ష చూపుతూనే ఉందన్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు పాకిస్థాన్‌కు నదీ జలాలు వెళ్లేలా చేస్తే, తాము ఆనకట్ట కట్టామన్నారు. కొన్నేళ్లుగా జమ్మూని ఈ మూడు పార్టీలు విస్మరించాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు.

ఆర్టికల్ 370 గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత వేర్పాటువాదం, ఉగ్రవాదం తగ్గిందన్నారు. వీటిని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. కశ్మీర్ యువత ఇప్పుడు రాళ్లకు బదులు, పెన్ను, పేపర్ పట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370ని ఏ శక్తీ వెనక్కి తీసుకు రాలేదన్నారు. జమ్ము కశ్మీర్‌ను తిరిగి రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లోనే ప్రకటించామని గుర్తు చేశారు.

# రాహుల్ గాంధీపై ఢిల్లీలోని మూడు పోలీస్ స్టేషన్లలో బీజేపీ ఫిర్యాదు

**పెన్ పవర్ డెస్క్:**లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల అమెరికా పర్యటనలో రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఇవాళ (గురువారం) ఢిల్లీలోని మూడు పోలీస్ స్టేషన్లలో రాహుల్ గాంధీపై ఫిర్యాదు కూడా చేసింది. పంజాబీ బాగ్, తిలక్ నగర్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లలో ఈ ఫిర్యాదులు నమోదయాయి. రిజర్వేషన్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలను విభజించేలా, రెచ్చగొట్టేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఉన్నాయని ఒక ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ అంతర్గత భద్రత, సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతను దెబ్బతీసేలా ఆయన మాట్లాడారని పేర్కొన్నారు.కాగా రాహుల్ గాంధీపై ఫిర్యాదులు చేసినవారిలో బీజేపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు మోహన్ లాల్ గిహారా, బీజేపీ సిక్కు సెల్ సభ్యుడు చరణ్‌జిత్ సింగ్ లవ్లీ, పార్టీ ఎస్టీ విభాగం సభ్యుడు సీఎల్ మీనా ఉన్నారు.

**కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టుపై ఎఫ్ఐఆర్..**

భారత్‌లో సిక్కుల పరిస్థితిపై ఇటీవల అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను తప్పుబడుతూ కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలపై కర్ణాటక కాంగ్రెస్ కమిటీ సభ్యుడు ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయింది. దీనికి ప్రతీకారంగానే బీజేపీ నేతలు ఢిల్లీలో రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

# జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేశాం

**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేశామని ఎస్వోటీ పోలీసులు వెల్లడించారు. జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి గోవా కోర్టులో హాజరుపరిచామని, పీటీ వారెంట్‌పై ఆయనను తరలించామన్నారు. రేపు ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. అతనిపై పోక్సో కేసుతో పాటు రేప్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేసినట్లు తెలిపారు.

**ఫిర్యాదులో ఏముందంటే?**

జానీ మాస్టర్‌పై ఫిర్యాదు చేసిన యువతి ఫిర్యాదులో వివిధ అంశాలు పేర్కొంది. తనకు 2017లో జానీ మాస్టర్ పరిచయం అయ్యాడని, 2019లో అతని గ్రూప్‌లో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరానని తెలిపింది. ఓ సినిమా చిత్రీకరణ కోసం ముంబైకి వెళ్లినప్పుడు అక్కడ హోటల్లో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని పేర్కొంది. ఈ విషయం ఎవరికైనా చెబితే గ్రూప్ నుంచి తొలగిస్తానని, తనను దాటి వెళితే పరిశ్రమలో పని చేయలేవని బెదిరించాడని తెలిపింది.

ఆ తర్వాత తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. షూటింగ్ సమయంలో వ్యానిటీ వ్యాన్‌లో తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని తెలిపింది. ఓసారి అతని కోరికను తీర్చనందుకు తన జుత్తును పట్టుకొని అద్దానికి కొట్టాడని ఫిర్యాదులో పేర్కొంది. అతని వేధింపులు భరించలేక అతని బృందం నుంచి బయటకు వచ్చానని తెలిపింది. కానీ తనను సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రాకుండా ఇబ్బంది పెట్టాడని తెలిపింది.

# 'సిక్కోలులో బాబాయ్, అబ్బాయ్ మార్క్

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ శ్రీకాకుళం, సెప్టెంబర్ 19: బాబాయ్ అబ్బాయిలపై సిక్కోలు జిల్లా అభివృద్ధి మంత్రం ఆధారపడి ఉంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు పదవులు వచ్చాయని అంతా అన్నారు. జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని ప్రజలు భావిస్తున్నారు. రామ్మోహన్ నాయుడు గత పదేళ్లుగా శ్రీకాకుళం ఎంపీగానే ఉన్నారు. ఆయన పార్లమెంటులో వివిధ సమస్యలపై గళం విప్పడంతో ప్రధాన మంత్రి మోదీ దృష్టిలో పడ్డారు. అంతేకాకుండా సీనియర్ కేంద్ర మంత్రులతో కూడా ఆయనకున్న సత్సంబంధాలే ఇప్పుడు సిక్కోలు జిల్లా అభివృద్ధికి ఆస్కారం ఏర్పడనుంది. ప్రధానంగా జిల్లాలోని ఆముదాలవలస, పలాస, రైల్వే స్టేషన్లు అభివృద్ధికి ఆస్కారం ఏర్పడిందిశ్రీకాకుళం రోడ్ మీదుగా నడిచే వివిధ రైళ్లుకూడ అక్కడ స్టేషన్ లో నిలిచేందుకు కృషి చేశారు. కేవలం శ్రీకాకుళం జిల్లాపైన కాకుండా రాష్ట్రంపై రామ్మోహన్ నాయుడు దృష్టి సారించారు. మొన్నటికి మొన్న విజయవాడ ఎయిర్ పోర్టులో ప్రత్యేక మార్గాన్ని ప్రారంభించారు. దేశంలో తొలిసారి అని ప్రకటించారు. ఇక రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు కూడా జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, సారవకోట మండలాల్లో ఏడు లిఫ్టు ఇరిగేషన్లు పడకేయగా వాటిన్నింటిని పునరుద్ధరించారు. కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి ఈ ఏడాది సుమారు రెండు వేల ఎకరాలకు నీరందించేందుకు కృషి చేశారు. ఇక గత ఐదేళ్లుగా గొట్టా బ్యారేజ్ నుంచి పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు మండలానికి సాగునీరు గగనమైంది. దాదాపు అరకోటి రూపాయలతో ఎడమకాలువ మరమ్మత్తు పనులు చేపట్టి వంశధార సాగునీరు శివారు ప్రాంతాలకు అందివ్వడంతో అప్రాంతీయుల్లో ఆనందం పొంగి ప్రవహించిందిటెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కొత్తమ్మ తల్లి జాతర సంబరాలు ప్రభుత్వం నిర్వహించడమే కాకుండా దాదాపు కోటి రూపాయలు మంజూరుకు కృషి చేశారు. ఇలా ప్రభుత్వం ఏర్పడిన తొలి వందరోజుల్లో బాబాయ్, అబ్బాయ్ తమ మార్కును చూపించారని స్థానికంగా వినిపిస్తోంది. విశాఖకు రైల్వే జోన్ డిమాండ్ అర్ధ శతాబ్దంపైగా ఉంది. ఇప్పటికి 55 ఏళ్ల కిందట విశాఖకు రైల్వే జోన్ కావాలని ఆనాటి విశాఖ లోక్ సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం పార్లమెంట్లో గళమెత్తారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం సమయంలో కొత్త జోన్లు ప్రకటించినా విశాఖకు ఆ అదృష్టం దక్కలేదు. ప్రధానిగా వాజ్ పేయ్ హయాంలోనూ మరికొన్ని రైల్వే జోన్లను ఇచ్చారు. అయినా కూడా విశాఖ పేరు ప్రస్తావనకు లేదు, విభజన హామీలలో చివరికి చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి దశాబ్దం దాటింది. కానీ ఇంకా రైల్వే జోన్ కూతను మాత్రం విశాఖ వాసులు వినలేదు. విశాఖ రైల్వే జోన్ ఇచ్చేశామని 2019 ఎన్నికల ముందు కేంద్రం ప్రకటించింది. కానీ అయిదేళ్లలో అడుగు ముందు పడలేదు. దానికి వైసీపీ ప్రభుత్వం భూమి చూపించలేదని కేంద్రంపేర్కొంది. తాము భూమి ఇచ్చామని వైసీపీ చెప్పింది. ఎక్కడ గ్యాప్ ఉందో తెలియదు కానీ అలా ఆ ప్రాజెక్ట్ అయితే నిలిచిపోయిందిప్రస్తుతం ఏపీలో, కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. దాంతో బీజేపీ రైల్వేజోన్ ఇవ్వడం పెద్ద సమస్య కాదు. ఏపీ సీఎం చంద్రబాబుకూడా అడిగి తెచ్చుకోగలరు. కానీ ఆలస్యం మాత్రం అలాగేకొనసాగుతోంది. విశాఖ రైల్వే జోన్ అదిగో ఇదిగో అనికేంద్రం గడచిన మూడు నెలలలో ప్రకటనలు చేస్తున్నారు. తాజాగా విశాఖకు మరో వందే భారత్ రైలు మంజూరు చేసిన సందర్భంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రైల్వే జోన్ మీద మళ్లీ ఊరించే ప్రకటన చేశారు. విశాఖ రైల్వేజోన్కు త్వరలోనే భూమిపూజ నిర్వహిస్తామని చెప్పారు. దానికి ఒక ముహూర్తం కూడా ఆయన ప్రకటించారు. దసరా పండుగ తరువాత పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. దీంతో పదేళ్ల ఎదురుచూపులకు దసరా తర్వాత ఐనా తమకు శుభవార్త వస్తుందా అని ఉత్తరాంధ్ర వాసులు ఆలోచిస్తున్నారు. విశాఖకు రైల్వే జోన్ వస్తే తెన్నేటి కల సాకారం అవుతుందని అంటున్నారు. ఇక విశాఖపట్నం రైల్వే జోన్కు సంబంధించి రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే రైల్వే జోన్ హెడ్ క్వార్టర్స్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రైల్వే జోన్ కార్యాలయం కోసం టీడీపీ కూటమి విశాఖలో ఇప్పటికే 52 ఎకరాలను కేటాయించిన క్రమంలో ఇక కేంద్రానిదే ఆలస్యం అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఈ సువిశాలమైన ప్రాంతంలోనే రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తారని వినిపిస్తోంది.



## పుంగునూరుకు దూరంగా పెద్దిరెడ్డి...



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ తిరుపతి, సెప్టెంబర్ 19: చిత్తూరు జిల్లా పాలిటిక్స్ లో పెద్దాయనగా పుంగనూరులో పెద్దిరెడ్డికి ఇంపార్టెన్స్ ఉన్నా.. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో అక్కడ సీన్ రివర్స్ అయ్యింది. పెద్దిరెడ్డి ఫ్యామిలీకి తిరుగులేని పుంగనూరులో ఇప్పుడు పర్యటించాలంటేనే పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. పెద్దిరెడ్డితో పాటు, తమ్ముడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, కొడుకు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఇలా ముగ్గురూ ఫ్యామిలీ మెంబెర్స్ గెలిచినా ఆ ఫ్యామిలీకి ఇప్పుడు అక్కడ చుక్కెదురవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పుంగనూరులో పెద్దిరెడ్డి ఫ్యామిలీ పర్యటించాలంటే భారీ పోలీసు బందుబస్తు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యుడుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలు స్థానిక ప్రజాప్రతినిధులుగా ఉన్నా ఆ నియోజకవర్గంలో వారి పర్యటన సాఫీగా సాగని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజన అంశం పుంగనూరు పాలిటిక్స్ లో కొత్త అంశాన్ని తెరమీదికి తెచ్చింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం సదుం జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో పుంగనూరు నుంచి విడిపోతుందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో పెద్దిరెడ్డి ఇక పుంగనూరుకు దూరం అవుతారంటూ చర్చ నడుస్తోంది. పెద్దిరెడ్డి వర్గంపై ప్రభావం చూపేలా జరుగుతున్న ఈ ప్రచారం వైసీపీ కేడర్ లో గందరగోళానికి కారణం అయ్యింది. ఈ నేపథ్యంలోనే పుంగనూరులో పర్యటించడమే పెద్దిరెడ్డి ఫ్యామిలీకి ఇబ్బందికరంగా మారడం, పుంగనూరుకు ప్రస్తుతం పెద్దిరెడ్డి కూడా దూరంగా ఉండటం కేడర్ కు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రచారం వాస్తవమని క్యాడర్ నమ్ముతున్న పరిస్థితుల్లో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పర్యటన, చేస్తున్న కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి..భారీ భద్రత మధ్య పుంగనూరు నియోజకవర్గంలో రోజుకో మండలాన్ని చుట్టేస్తున్న ఎంపీ మిథున్ పుంగనూరు కన్నతల్లి లాంటిదని, పుంగనూరును వదిలి వెళ్ళమని కేడర్ కు హామీ ఇస్తూ వస్తున్నారు. పుకార్లను నమ్మొద్దని, పునర్విభజన జరిగితే పుంగనూరు నుంచి ఎమ్మెల్యేగా తానే పోటీ చేస్తానంటూ ప్రకటన చేయాల్సి వచ్చింది. ఇలా ఎంపీ ఇస్తున్న భరోసా ఇప్పుడు పుంగనూరు పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. 2009 నుంచి వరుసగా గెలుస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గాల పునర్విభజన జరిగితే పుంగనూరును నిజంగానే వీడుతారా..? రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న పుంగనూరు నుంచి ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న పెద్దిరెడ్డి మిథున్ వారసుడిగా పుంగనూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా..? లేదంటే పెద్దిరెడ్డి వారసుడిగా మరొకరు బరిలో ఉంటారా..? అన్నదే హాట్ టాపిక్ అయింది. సొంత మండలం సదుం పుంగనూరు నుంచి విడిపోయినా తిరిగి పెద్దిరెడ్డినే పుంగనూరు నుంచి పోటీ చేస్తారా..? అన్న దానిపై స్పష్టత లేకపోగా పునర్విభజన అంశం మాత్రం పుంగనూరు పాలిటిక్స్ లో ఆసక్తికర రాజకీయ అంశంగా మారిపోయింది.

## పాజిటివ్ టాక్ లో ఎన్డీయే సర్కార్



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 19: ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ కాంబినేషన్ సూపర్ హిట్ అయింది. ఎన్డీఏ ఏపీలో అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయింది. అయితే ఈ సందర్భంగా ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. అయితే ఇది అతి తక్కువ సమయం. కేవలం వంద రోజుల సమయంలో మ్యాజిక్ లు చేయడానికి చంద్రబాబు ఏమీ మెజీషియన్ కాదు. హామీలు అమలు చేయలేదంటే అందుకు బలమైన కారణం కూడా లేకపోలేదు. వరసగా విడతల వారీగా చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కొంత సమయం పట్టే అవకాశముంది. అప్పుడే పెదవి విరుపులు, విమర్శలు చేయడం కూడా ఎన్డీఏ ప్రభుత్వంపై చేయడం సరికాదన్న అభిప్రాయం కూడా ఎక్కువ శాతం మంది ప్రజల్లో వ్యక్తమవుతుంది. ఈ ఏడాది జూన్ 12వ తేదీన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. తర్వాత వెనువెంటనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తెలిసి కంగుతిన్నా వచ్చిన మొదటి నెల వృద్ధులకు ఏడువేల రూపాయలు, తర్వాత నెల నుంచి నెలకు నాలుగు వేల రూపాయలు పెన్షన్ ఇస్తున్నారు. దివ్యాంగులకు ఆరువేలు ఇస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అదే రోజున పింఛను చెల్లించడం పక్కాగా చేస్తున్నారు. దీంతో పాటు యువత కోసం చెప్పిన విధంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్సీకి కూడా షెడ్యూల్ విడుదల చేశారు. ఇక పేదోడి ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగా అన్నా క్యాంటిన్లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు విజయవాడ వరదలు వచ్చిన సమయంలో పదకొండు రోజుల పాటు బస్సులోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షించారువరదల సమయంలో అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ వారికి ఆహారం, మంచినీరు, పాలు, నిత్యావసరాలు వంటివి అందచేయడంలో అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. అంతేకాదు పూర్తిగా మిగిలి పోయిన ఇంటికి ఇరవై ఐదు వేలు, ఫస్ట్ ఫ్లోర్ కు పది వేలు, నీట మునిగిన ఇళ్లకు పది వేలు, మోటారు బైక్‌లకు మూడు వేలు, ఆటోలకు పది వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు భారీ సాయాన్ని ప్రకటించి పెద్దమనసును చాటు కున్నారు. గతంలో వరద బాధితులకు ఏ ప్రభుత్వమూ ఇంతటి స్థాయిలో సాయాన్ని ప్రకటించలేదు. ఇక అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా రద్దు చేశారు. సంక్షేమ కార్యక్రమాల విషయంలో కొంత నెమ్మదించినా అభివృద్ధి విషయంలో మాత్రం ఆయన స్పీడ్ 1995 తరహాలో ఉందన్న ప్రశంసలు అందుకున్నారు. మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి పెద్దయెత్తున నిధులు తేవడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను తేవడంలో విజయవంతమయ్యారు. తన హస్తిన పర్యటనలను చంద్రబాబు చక్కగా వినియోగించుకున్నారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులను నిధుల మంజూరుకు ఒప్పించి ఏపీ ప్రజలను మెప్పించగలిగారు. అయితే విమర్శలు చేసే వారికి మాత్రం కొదవలేదు. కానీ వారిని పెద్దగా పట్టించుకోకుండా ఒకవైపు మంత్రులను, మరొకవైపు అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆయన పాలన కొనసాగించారు. తన అనుభవాన్ని అంతా రంగరించి మరీ చంద్రబాబు నాయుడు ఏపీని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించేందుకు శ్రమిస్తున్నారు. ఆయనకు అందరూ తోడ్పడితే త్వరలోనే ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## దూరమవుతున్న పార్టీ పిల్లర్లు...




స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర 19: వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మొదటి నుంచి కలిసి నడుస్తున్న నేతలు ఒక్కొక్కరిగా దూరమవుతున్నారు. తాజాగా బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీకి దూరమయ్యారు. ఆయన పార్టీ పరిస్థితిపై సంచలన ఆరోపణలు చేయబోతున్నారు. జగన్ కోసం మొదట్లో రాజీనామా చేసిన నేత మాత్రమే కాదు.. జగన్ సమీప బంధువు కూడా. అయనను కూడా జగన్ తో పాటు కలిసి నడిచేలా ఉంచుకోలేకపోతున్నారు. ఒక్క దారుణ పరాజయం తర్వాత వైసీపీ ఫేట్ ఒక్క సారిగా మారిపోయింది. అతి భారీ మెజార్టీలతో ఓడిపోవడంతో భవిష్యత్ ఉంటుందా లేదా అన్న గందరగోళంతో పాటు జగన్ వ్యవహారశైలి వల్ల ఇబ్బంది పడిన వారంతా.. మెల్లగా వేరే దారి చూసుకుంటున్నారు. నిజానికి ఇంకా ఎన్డీఏ కూటమిలోని పార్టీలు ఆపరేషన్ ఆకర్ష్ వంటి కార్యక్రమాలు చేపట్టలేదు. వైసీపీలో ఉక్కపోత భరించలేని వాళ్లు.. భవిష్యత్ పై భయం ఉన్న వాళ్లు మెల్లగా సర్దుకుని కూటమి పార్టీల్లో చేరిపోతున్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా అంతే. ఆయన ఓటమి తర్వాత కూడా.. వైసీపీ పాలసీ అయిన ఈవీఎంలకు వ్యతిరేకంగా పోరాడారు. కోర్టుల్లో కేసులు వేశారు . అయితే గుర్తించడానికి.. గుర్తింపు ఇవ్వడానికి జగన్ సిద్ధంపడలేదు. చివరికి ఆయన పార్టీకి గుడ్ బై చెప్పాల్సి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిన తర్వాత వైసీపీలో అందలం ఎవరికి దక్కింది అంటే.. బొత్స సత్యనారాయణ సహా ఇతర సీనియర్లకు దక్కింది. వీరిలో చాలా మంది జగన్ తో పాటు నడవలేదు. కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్ లేదని తేలిన తర్వాతే జగన్ వద్దకు వచ్చారు. బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు వంటి వారు జగన్ పై ఎన్నో విమర్శలు చేశారు. మాజీ మంత్రి కన్నబాబు కూడా అంతే. ఇలాంటి వారందరికీ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రయారిటీ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత తనతో పాటు నడిచినచాలా మందిని పక్కన పెట్టేశారు. కొంత మంది ఎన్నికలకు ముందే పార్టీ మారిపోగా.. జగన్ ను విడిచి పెట్టలేక ఎన్నో అవమానాలు ఎదుర్కొని అయినా పార్టీలోనే కొనసాగుతున్న బాలినేని వంటి వాళ్లు ఇప్పుడు దండం పెట్టేస్తున్నారు. ఇప్పుడు జగన్ ఎవర్ని నమ్ముతున్నారు అంటే.. బొత్స, చెవిరెడ్డి , సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారినే. జగన్ జైల్లో ఉన్నప్పుడు పార్టీ కోసం శ్రమించిన షర్మిల ఎప్పుడో దూరమయ్యారు. గతంలో చేసిన పనుల వల్ల జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితం సాఫీగా సాగే అవకాశం లేదు. ఆయన ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా అక్రమాస్తుల కేసులు లాగే వివేకా హత్య కేసులోనూ ఆయనకు చిక్కులు తప్పవు. గత ప్రభుత్వ అవినీతి అంశంలో.. ఇప్పటికే మద్యం, ఇసుక , మైనింగ్ వంటి చోట్ల పెద్ద ఎత్తున కేసులు పెట్టేందుకు ప్రభుత్వం రెడీ అవుతుంది. ఇలాంటి పరిణామాలతో జగన్ మోహన్ రెడ్డి.. అత్యంత గడ్డు పరిస్థితుల్ని ఎదుర్గోబోతున్నారు. ఇలాంటి సమయంలో ఆయనతో పాటు నడిస్తే తాము మునిగిపోతామని అనుకుంటే.. ఎక్కువ మంది గుడ్ బై చెప్పే అవకాశం ఉంది. అసెంబ్లీ సీట్లు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో.. జగన్మోహన్ రెడ్డి తనతో మొదటి నుంచి నడిచిన సీనియర్ నేతల్ని కూడా తనతో పాటు ఉంచుకోలేకపోతే ఆయనకు తీరని నష్టం జరుగుతుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఎక్కువగా ఉంది


# బీసీలపై స్పెషల్ ఫోకస్




స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 19: ఏపీలో కూటమి ప్రభుత్వం బీసీలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు కులాలవారీగా కార్పొరేషన్లు పెట్టి ఆకట్టుకుంది. ఆ కార్పొరేషన్ల వల్ల అట్టడుగు వర్గాలకు లాభం జరిగిందా, కేవలం చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేషన్ మెంబర్లు లబ్ధిపొందారా అనే విషయం పక్కనపెడితే తాజాగా కూటమి ప్రభుత్వం బీసీలకు నిజమైన ప్రోత్సాహం అందిస్తామంటూ ముందుకొస్తోంది. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా మరో అడుగు ముందుకేస్తామంటోంది. ఈమేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామంటోంది ప్రభుత్వం. దీనికోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సంబంధించిన ఫైల్ పై ఈరోజు మంత్రి వర్గ సమావేశంలో చర్చిస్తారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై తీర్మానం చేయడానికి ఇది సన్నాహక కార్యక్రమంగా తెలుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో అమలైన ఎన్టీఆర్ విదేశీవిద్య, విద్యోన్నతి పథకాలను పునరుద్ధరించాలని కూడా సీఎం చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు లబ్ధిదారులుగా ఉన్న పథకాల నిబంధనల్లో మార్పులు చేయాలని, ఎక్కువ మందికి లబ్ధి కలిగేలా నిబంధనలు సవరించాలని ఆయన చెప్పారు. 26 జిల్లాలకు సంబంధించి ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవన్ నిర్మాణాలు చేపట్టాలని, దానికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని కూడా సీఎం సూచించారు. ఇక బీసీ స్టడీసర్కిళ్లు నిధులు లేక కార్యకలాపాలు స్తంభించాయని, వాటికోసం వెంటనే రూ.10 కోట్లు విడుదల చేయాలని చెప్పారు. సచివాలయంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమశాఖల సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు చంద్రబాబు. బీసీ రిజర్వేషన్ ఫైల్ సహా ఇతర కీలక అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఏపీలో 139 బీసీ ఉపకులాల వారికి లబ్ధి చేకూర్చేలా కార్పొరేషన్లను పునర్ వ్యవస్థీకరించడానికి కూడా కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 56 బీసీ కార్పొరేషన్లను పునర్ వ్యవస్థీకరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కులాలు, ఉప కులాల వారీకా కార్పొరేషన్ల పునర్ వ్యవస్థీకరణ ఉండాలన్నారు. బీసీల అభ్యున్నతికి కేంద్రం కూడా పలు పథకాలు అమలు చేస్తోంది. ప్రతి ఏడాదీ రూ.100కోట్ల మేర రాయితీ రుణాలు అందిస్తుంది. దీనికి రాష్ట్ర ప్రబుత్వం రూ.38 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ గా విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ నిధుల్ని తక్షణం విడుదల చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇక గత ప్రభుత్వం వదిలి పెట్టిన బకాయిల విషయంలో కూడా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గురుకుల విద్యార్థులకు రూ.110 కోట్ల మేర డైట్ ఛార్జీలు, రూ.20.52 కోట్ల మేర కాస్మొటిక్ ఛార్జీలను గత ప్రభుత్వం బకాయి పెట్టిందని, వాటిని తమ ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు చంద్రబాబు. ఇక బీసీ హాస్టల్స్ మరమ్మతులు, విద్యాసామగ్రి ఖర్చులు, స్కాలర్ షిప్ లకు సంబంధించి రాష్ట్ర వాటాను కూడా వెంటనే విడుదల చేస్తామన్నారు. బీసీ భవన్, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు గతంలో తాము ప్రారంభించామని, ఆగిపోయిన చోట్ల తిరిగి నిర్మాణాలు ప్రారంభించాలని, వాటికి అవసరమయ్యే నిధుల్ని వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం చంద్రబాబు. ఇక బీసీలకు సంబంధించి బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

# పార్టీ నుంచి సపోర్ట్ లేదన్న ఫీలింగ్

## బాలినేని షాక్...




స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ ఒంగోలు, సెప్టెంబర్ 19: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేశారు. కొంతకాలంగా బాలినేని పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీలో ఆయన ఉక్కపోతకు గురవుతున్నారు. తనకు ఏ మాత్రం గౌరవం లభించడం లేదని ఆయన కొంత కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందే ఆయన రాజీనామా చేస్తారన్న ప్రచారం జరిగింద. అయితే చివరి క్షణంలో జగన్ బుజ్జగించడంతో ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీ చేశారు. అయితే ఆయన ఘోరపరాజయం పాలయ్యారు. ఆ తర్వాత తాను ఈవీఎంల వల్లే ఓడిపోయానని పోరాటం చేశారు. ఈవీఎంల చెకింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కోర్టుల్లోనూ కేసులు వేశారు. అయితే పార్టీ నుంచి కనీసం సపోర్టు లేదని.. జగన్ పట్టించుకోవడం లేదని అసంతృప్తి ప్రకటనలు చేశారు. ఇటీవల జగన్ తో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో తాను ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లుగా చెబుతున్నారు. కానీ పార్టీలో మార్పులు తాను అనుకున్నట్లుగానే జరుగుతాయని.. ఒంగోలు అసెంబ్లీలో మాత్రమే పని చేసుకోవాలని.. ఇక ఎక్కడా కల్పించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసినట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో తిరుపతికి చెందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ని ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తారని అంటున్నారు. ఆయన పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయడంపై కూడా.. బాలినేని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా ఆయన మాట వినలేదు. బాలినేని పార్టీ మారడం ఖాయమని తేలడంతో.. బుజ్జగించేందుక పార్టీ నేతలు విడదల రజనీ.. రామసుబ్బారెడ్డిలను ఆయనతో చర్చలకు పంపారు. అయితే బాలినేని మాత్రం వెనక్కి తగ్గలేదు. రాజకీయాలు వేరు, బంధుత్వాలు వేరని బాలినేని తన రాజీనామా లేఖలో తెలిపారు. తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు జగన్ ను అడ్డుకున్నానని .. ఎలాంటి మొహమాటలకు పోలేదన్నారు. అంతిమంగా ప్రజా తీర్పును ఎవరైనా హుందాగా తీసుకోవాల్సిందేనన్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా... రెండు సార్లు మంత్రిగా చేశానన్న తృప్తి ఉందన్నారు. రాజకీయాల్లో భాష హుందాగా ఉండాలని నమ్మే నిఖార్సైన రాజకీయం చేశానని విలువల్ని కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏ పార్టీ వ్యక్తి తన దగ్గరకు వచ్చినా సాయం చేస్తానని బాలినేని లేఖలో పేర్కొన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారన్నదానిపై ఇంత వరకూ స్పష్టత లేదు. త్వరలో అనుచరులతో కలిసి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను కలుస్తానని చెప్పారు. బాలినేని శ్రీనివాసరెడ్డి.. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి దగ్గర బంధువు. అయితే మరో బంధువు వైవీ సుబ్బారెడ్డి కూడా ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఉన్నారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరాటంలో వైఎస్ జగన్ సుబ్బారెడ్డికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. ఇది కూడా బాలినేని అసంతృప్తికి కారణం అయిందని భావిస్తున్నారు.

# తొలి రోజు మనదే.. భారత్‌ను నిలబెట్టిన అశ్విన్, జడేజా



చెన్నై వేదికగా చిదంబరం స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్ట్ తొలి రోజు టీమిండియా పై చేయి సాధించింది. ఒక దశలో భారత్ 144 పరుగులకే 6 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో ఏమైనా సంచలన ఫలితం నమోదవుతుందో అనే అనుమానం కలిగింది. అయితే ఆల్ రౌండర్లు రవి చంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా బంగ్లాదేశ్ కు బౌలింగ్ జోరుకు అడ్డుకట్ట వేశారు. బౌలింగ్ లోనే కాదు బ్యాటింగ్ లోనూ టీమిండియాను ఆదుకోగలమని మరోసారి నిరూపించారు.

వీరిద్దరూ భారీ భాగస్వామ్యంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. వీరిద్దరూ ఏడో వికెట్ కు అజేయంగా 195 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడం తొలి రోజు మ్యాచ్ లో హైలెట్ గా నిలిచింది. బంగ్లా బౌలర్లకు ఏ మాత్రం అవకాశమివ్వకుండా అలవోకగా ఆడేశారు. ముఖ్యంగా అశ్విన్ వన్డే మ్యాచ్ ల బ్యాటింగ్ చేస్తూ సెంచరీ (102) బాదేశాడు. మరో ఎండ్ లో జడేజా (86) సైతం వేగంగా పరుగులు రాబట్టి సెంచరీ ముంగిట నిలిచాడు.టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన భారత్ కు బంగ్లా బౌలర్ హసన్ మహ్మద్ కోలుకోలేని దెబ్బ కొట్టాడు. టీమిండియా టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ 24 ఏళ్ల యువ పేసర్ ధాటికి టీమిండియా టాపార్డర్ చేతులెత్తేసింది. హసన్ మహ్మద్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ(6) విరాట్ కోహ్లీ (6) సింగిల్ డిజిట్ కే పరిమితం కాగా..శుభ్‌మన్ గిల్ డకౌట్ గా వెనుదిరిగాడు. దీంతో భారత్ 34 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ జైశ్వాల్ 56 పరుగులు చేసి బాధ్యతాయుత బ్యాటింగ్ చేశాడు. 39 పరుగులు చేసి పంత్ అతనికి చక్కని సహకారం అందించాడు.

# మూడు ఇన్నింగ్స్‌ల్లో రెండు డకౌట్లు.. దులీప్ ట్రోఫీలోనూ అయ్యర్ విఫలం



టీమిండియా బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ కష్టాలు కొనసాగుతున్నాయి. భారత జట్టులో స్థానం సంపాదించుకోలేని అయ్యర్.. దేశవాళీ క్రికెట్ లోనూ ఘోరంగా విఫలమవుతున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న దులీప్ ట్రోఫీలో ఇండియా డి తరపున ఆడుతున్న శ్రేయాస్.. తొలి ఇన్నింగ్స్ లో డకౌటయ్యాడు. 5 బంతుల్లో పరుగుల ఖాతా చేయకుండా రాహుల్ చాహర్ బౌలింగ్ లో పెవిలియన్ కు చేరాడు. కెప్టెన్ గా జట్టును ముందుండి నడిపించాల్సిన ఈ ముంబై స్టార్.. జట్టుకు భారంగా మారుతున్నాడు.దులీప్ ట్రోఫీలో చివరి మూడు ఇన్నింగ్స్ ల్లో అయ్యర్ కు ఇది రెండో డకౌట్. ఇప్పటివరకు ఐదు ఇన్నింగ్స్ లు ఆడిన అయ్యర్.. కేవలం ఒకే హాఫ్ సెంచరీ చేశాడు. 20 యావరేజ్ తో 104 పరుగులు మాత్రమే చేశాడు. ఇటీవలే జరిగిన మ్యాచ్ లో సన్ గ్లాస్ పెట్టుకొని బ్యాటింగ్ చేసిన అయ్యర్ డకౌటై తీవ్ర విమర్శల పాలయ్యాడు. తాజాగా చివరి రౌండ్ లీగ్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లోనూ డకౌటయ్యాడు. దీంతో అయ్యర్ ఇక భారత జట్టులో చోటు దక్కించుకోవడం అనుమానంగా మారింది. %ూశ్రీంశీ =ఘుంసం% :- పంత్‌కు కోపం తెప్పించిన బంగ్లాదేశ్ వికెట్ కీపర్క్రమశిక్షణ లేని కారణంగా బీసీసీఐ అతన్ని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ఫామ్ లేకపోవడం.. గాయాలు అతన్ని జట్టు నుంచి దూరం చేశాయి. గంభీర్ ప్రధాన కోచ్ కారణంగా ఇటీవలే శ్రీలంకతో ముగిసిన మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ లోనూ అయ్యర్ ఘోరంగా విఫలమయ్యాడు. ఇప్పటికే టీ20 జట్టులో స్థానం కోల్పోయిన అయ్యర్.. ఫామ్ లోకి రాకపోతే భారత జట్టులో ఎంట్రీ కష్టంగానే కనిపిస్తుంది.

# శ్రీలంక మాజీ క్రికెటర్‌పై ఆస్ట్రేలియా క్రికెట్ 20 ఏళ్ళు నిషేధం




శ్రీలంక మాజీ టెస్టు క్రికెటర్ దులిప్ సమరవీరపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు 20 ఏళ్ల నిషేధం విధించింది. విక్టోరియా మహిళా జట్టు కోచ్‌గా పనిచేస్తున్న అతను ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు తేలింది. సిఎ ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్ 2.23ని ఉల్లంఘించే విధంగా సమరవీర అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లు ప్రవర్తనా సంఘం గుర్తించింది. క్రికెట్ విక్టోరియా (%జఎ%)లో సమరవీర కోచింగ్ చేస్తున్న సమయంలో ఒక మహిళా క్రికెటర్ తో అనుచిత ప్రవర్తన కారణంగా అతనిపై ఆరోపణలు వచ్చాయి.

ఇందులో భాగంగా విచారణను ఎదుర్కొంటున్నాడు. 52 ఏళ్ల అతను రాబోయే రెండు దశాబ్దాల పాటు క్రికెట్ ఆస్ట్రేలియాలో ఎలాంటి పదవులు నిర్వహించడానికి వీలు లేదు. శ్రీలంక తరపున ఏడు టెస్టులు, ఐదు వన్డేలు ఆడిన సమరవీర.. మొదటిసారి బ్యాటింగ్ కోచ్‌గా 2008లో క్రికెట్ విక్టోరియాలో చేరాడు. గత ఏడాది నవంబర్‌లో మహిళల జట్టుకు తాత్కాలిక ప్రధాన కోచ్‌గా ఎంపికయ్యాడు. శ్రీలంక తరపున అంతర్జాతీయ క్రికెట్ లో 7 టెస్టుల్లో 211 పరుగులు.. 5 వన్డేల్లో 91 పరుగులు చేశాడు.

# ప్రభాస్‌తో ఒక్క ఛాన్స్ పాజిబులేనా?



కృతి సనన్ నెయిల్స్ బ్లాక్ లు



అనుష్కశెట్టి.. తమన్నా భాటియా.. త్రిష.. కాజల్.. అన్ను.. శ్రద్ధా కపూర్.. దిశా పటానీ.. ఇలా చాలామంది అగ్రకథానాయికలు టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ సరసన నటించారు. కానీ ఈ లిస్ట్ లో ప్రతిభావంతురాలైన సమంత పేరు ఎందుకు లేదు? ఆ ఇద్దరి కెరీర్ సుదీర్ఘ రన్ తో విజయవంతంగా కొనసాగినా ఎందువల్ల కలిసి పని చేయలేదు? ఇలాంటి ఎన్నో సందేహాలు అభిమానులకు ఉన్నాయి. కానీ ఆ ఇద్దరికీ నడుమ అలా సెట్ కాలేదు అంతే! అయితే హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ప్రభాస్ చిత్రంలో సమంత నటిస్తే బావుంటుందని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. సోషల్ మీడియాల్లో దీనికి డిమాండ్లు ఊపందుకున్నాయి. కానీ సమంతకు ఇంకా అలాంటి ఛాన్స్ దొరకడం సులువు కాదని తేలిపోయింది. దీనికి కారణం ఇప్పటికే ప్రభాస్ సరసన ఇద్దరు కథానాయికలు ఎంపికయ్యారని తెలిసింది. ఇంతకుముందే ఒక హీరోయిన్ గా ఇమాన్విని ఎంపిక చేసారు. తాజా సమాచారం మేరకు.. రెండో హీరోయిన్ ని ఒకే చేసేశారు.. కానీ సమంతను నటింపజేయాలని అభిమానులు కోరుతున్నారు. ఇప్పటికి సామ్ కి నో ఛాన్స్! అని సరిపెట్టుకోవాల్సి ఉంది. ప్రభాస్ నటించిన సలార్ గ్రాండ్ సక్సెస్ తర్వాత మారుతితో రాజా సాబ్ చిత్రీకరణకు వెళ్లింది. తదుపరి సలార్ 2లోను ప్రభాస్ నటించాల్సి ఉంది. మరోవైపు సమంత సొంత బ్యానర్ సినిమా గోల్డ్ లో నటిస్తోంది. సిటాడెల్ హనీ బన్నీ స్ట్రీమింగుకి రావాల్సి ఉంది. ఇతర సినిమాల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



అనసూయ ఎ భరద్వాజ్ రావిషింగ్ లుక్ మిమ్మల్ని మంత్రము గ్దులను చేస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com